క్లుప్తంగా

విజయగణపతికి ప్రత్యేక పూజలు



కొమరవోలు(పామర్రు): గ్రామ శివారు గాంధీ ఆశ్రమంలోని విజయగణపతి ఆలయంలో సంకట హర చతుర్థిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి ఉదకాభిషేకం, క్షీర, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను చేశారు. అనంతరం స్వామికి మోదక పూజ, గరిక అర్చనలు చేశారు. ప్రవాస భారతీయులు అయ్యంకి గ్రామస్తులు పామర్తి వెంకట జయరామకృష్ణ రజని దంపతుల వితరణతో భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

పాస్టర్స్‌ఫెలోషిఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



పామర్రు: స్థానిక కొత్త పేటలోని ప్రధాన కాపరి ప్రార్థనా మందిరంలో సోమవారం పాస్టర్స్ ఫెలోషిప్–2025 నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెవరెండ్ డాక్టర్ కె యేసుదాసు, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ ఎన్.శామ్యూలు, కార్యదర్శులుగా రెవ. సునీల్ పురుషోత్తం, రెవ. బి.విద్యాసాగర్, కోశాధికారిగా పాస్టర్ బి.ఇశ్రాయేలు, పాస్టర్ బి.జాషువా, గౌరవాధ్యక్షులుగా రెవ.యెహెజ్కేలు, రెవ.ఎం. శామ్యూలు, రెవ. డి శాంతివర్ధన్, రెవ.ఎల్ జయపాల్‌ను ఎన్నుకున్నారు.

సచివాలయ ఉద్యోగికి సత్కారం



గుడివాడరూరల్: మండలంలోని లింగవరం సచివాలయంలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ బి.జోషి మేరీని గ్రామానికి చెందిన నేతాజీ నైజం యూత్ ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. బదిలీపై వెళ్తున్న ఉద్యోగిని విధి నిర్వహణలో గ్రామస్తులు అందించిన సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడిగా శ్యామ్‌గణేష్



మండవల్లి: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా వరదా శ్యామ్‌గణేష్ ఎంపికయ్యారు. ప్రాంతీయ కార్యదర్శిగా తుంపూడి గణేష్‌ను ఎంపిక చేశారు. స్థానిక స్టేషన్‌రోడ్ చిన్నా రైస్‌మిల్లు వద్ద ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు ఆర్యవైశ్య సంఘం జిల్లా, మండల అధ్యక్షులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్య వైశ్యసంఘం అధ్యక్షుడు నాగసాయి శ్రీనివాస్, పెద్దలు ఘంటసాల రాజమోహన్ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మొవ్వ: స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో అతిథి అధ్యాపక పోస్టుల (గెస్ట్ ఫ్యాకల్టీ) భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.సత్యనారాయణ సోమవారం విలేకరులకు తెలిపారు. ఇంగ్లిష్–2 పోస్టులు, హిందీ–1 పోస్ట్, కామర్స్ ఒకేషనల్–1 పోస్ట్ భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో గుర్తింపు పొందిన యూనివర్సిటీల నుంచి పీజీలో 50% మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల16వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలని పేర్కొన్నారు. 17వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: విద్యుత్ తీగలకు అడ్డు వచ్చే చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలిదిండి మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగుతుందని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. పోతుమర్రు, కలిదిండి సబ్‌స్టేషన్ పరిధిలో పోతుమర్రు, కలిదిండి, తాడినాడ, గొల్లగూడెం, సున్నంపూడి, ఇభరాంపురం, చినతాడినాడ, కలిదిండి, వెంకటాపురం, గుర్వాయిపాలెం, లోడిదిలంక, కొండంగి, గోపాలపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

పల్లెల్లో పాలకొరత!

- తగ్గుతున్న పశుసంపద
- పాల కోసం తప్పని తిప్పలు



తోట్లవల్లూరులో ఓ డెయిరీ వద్ద పాల కోసం ప్రజల నిరీక్షణ

తోట్లవల్లూరు: పశుసంపద తగ్గుతుండటంతో ప్రజలు పాల కొరతను ఎదుర్కొంటున్నారు. నానాటికీ పశుపోషణ క్షీణిస్తుండటంతో పల్లెల్లో సైతం పాల కొరత ఏర్పడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తోట్లవల్లూరు మండలంలో 16 గ్రామాలున్నాయి. వ్యవసాయాధారిత మండలం కావటంతో గతంలో పశుపోషణ, పాడిసంరక్షణతో గ్రామాలు కళకళలాడేవి. కరకట్ట వెంబడి లంక ప్రాంతాలు ఉండటంతో మేతకు కూడా ఎలాంటి కొరత ఉండేది కాదు. దీంతో పాల ఉత్పత్తి పుష్కలంగా ఉండేది. గ్రామస్తుల అవసరాలకు సరిపడా పాలు లభ్యమయ్యేవి. మిగిలిన వాటిని రైతులు విజయ మిల్క్ యూనియన్‌తోపాటు ప్రైవేటు డెయిరీలకు విక్రయించేవారు.

భారంగా పశుపోషణ..

పశుపోషణ భారంగా మారుతోంది. మేత, దాణా, కూలి ఖర్చులు పెరిగిపోతుండటంతో రైతులు పాడి సంరక్షణకు దూరమవుతున్నారు. పెట్టే ఖర్చులకు వచ్చే ఆదాయానికి పొంతన లేకుండా పోతుండటంతో రోజురోజుకి గ్రామాల్లో పాడి గేదెల పెంపకం తగ్గిపోతోంది. దీంతో పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతోంది.

పాల కోసం నిరీక్షణ..

గ్రామాల్లో ప్రజలు పాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. రైతుల వద్ద పాల లభ్యత తగ్గిపోతుండటంతో కొంత మంది పాల ప్యాకెట్లను వినియోగిస్తుండగా, మరి కొంత మంది పాల కోసం పాల కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. పాల కోసం పాల కేంద్రాల వద్ద గంటల కొద్దీ సమయం నిరీక్షించాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీటరు పాలకు రూ. 80 నుంచి రూ.100 వెచ్చిస్తున్నా ఇబ్బందులు తప్పటం లేదని అంటున్నారు.

నిరీక్షణ తప్పటం లేదు

పాడి పశువుల పెంపకం తగ్గిపోతుండటంతో గ్రామాల్లో సైతం పాల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అర లీటరు పాల కోసం పాల కేంద్రం వద్ద గంటల కొద్దీ సమయం నిరీక్షించాల్సి వస్తోంది.

– ఎం. సాయిబాబు, తోట్లవల్లూరు

పాల ఉత్పత్తి తగ్గుతోంది

పశుపోషణ భారంగా మారటంతో రైతులు పాడి పెంపకానికి దూరమవుతున్నారు. దీంతో పాల ఉత్పత్తి రోజు రోజుకి తగ్గిపోతోంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా పాల ఉత్పత్తి జరగటం లేదు.

– రమేష్,
పాల కేంద్రం నిర్వాహకుడు, తోట్లవల్లూరు

కేసులకు భయపడేది లేదు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: కేసులకు భయపడేది లేదని, పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. తాడంకిలో పార్టీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు నివాసంలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీ చైర్మన్, బీసీ మహిళ ఉప్పాల హారికపై టీడీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండించారు. తాడంకిలో కార్యకర్తల సమావేశం జరపకూడదని, 144 సెక్షన్ అమల్లో ఉందని పోలీసులు ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. పామర్రులో జరిగిన సమావేశంలో ఎవరో రప్పా..రప్పా అంటే పేర్ని నాని వారించారని, మాటలు వక్రీకరించి నానిపై, తనపై, మరో ఐదుగురు నాయకులపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. ఎవరెన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా నియోజకవర్గంలో లంచాలకు తావులేకుండా పాలన సాగించామన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కూటమి నాయకులకు సంపాదన తప్ప ప్రజల సమస్యలు పట్టడం లేదని ఆరోపించారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.


సాగునీరందక ఇక్కట్లు

సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, నదిలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతుందని తెలిపారు. సాగునీరందక వరినాట్లు వేసేందుకు అవస్థలు పడుతున్నామని రైతులు తెలిపారు. విద్యుత్ కోతతో ఇబ్బందులు పడుతున్నామని కార్యకర్తలు తెలిపారు.

పార్టీ పటిష్టతకు పాటుపడండి

మండలం నుంచి జిల్లా, మండల స్థాయిలో పదవులు పొందిన తిరుమలశెట్టి బోసుబాబు, పోలిమెట్ల వంశీకృష్ణ, యలమంచిలి గణేష్, పాతూరి చంద్రపాల్, కోడెబోయిన కోటేశ్వరరావు, బొల్లా సాంబశివరావు, కనుమూరి వెంకటేశ్వరరావు, గొర్ర్కెపూడి బుజ్జి, హిదయతుల్లాను అనిల్‌కుమార్ సత్కరించారు. పార్టీ పటిష్టతకు పాటుపడాలని సూచించారు. పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, ఎంపీపీ కాసాని వేదసుప్రజ, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి శ్రీలక్ష్మి, మేరుగ లక్ష్మి, నాయకులు యేనుగ మస్తాన్‌రావు, కొణతం శివరామకృష్ణ, కొడాలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందక ఎండుతున్న వరి



వెంట్రప్రగడలో నీరు లేక నెర్రెలిచ్చిన పొలం

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడలో వరినాటిన పొలాలు సాగునీరు అందక ఎండిపోతున్నాయి. బోర్లు కింద సాగు చేసిన పొలాల్లో చుక్కనీరు లేక పోవటంతో కళ్ల ముందే వరి పంట దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 రోజుల క్రితం నాటిన వరి పంటకు చానల్ ద్వారా నీరు రాకపోవటం, వర్షాలు పడకపోవటంతో పరిస్థితి దయనీయంగా మారిందని రైతులు అంటున్నారు. మరో వారం రోజులు సాగునీరు పొలాలకు అందకపోతే వరి పూర్తిగా దెబ్బతింటుందని చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారులకు సమస్యను తెలియజేసినా ప్రయోజనం కనిపించటం లేదని రైతులు అంటున్నారు. కొంతమంది రైతులు చేసేది లేక ఆయిల్ ఇంజిన్లు పెట్టి సాగునీరు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని అంటున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం బహుళ చవితి సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలోని కాలక్షేప మండపంలో ఈ హోమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో 105 మంది ఉభయదాతలు పాల్గొని హోమద్రవ్యాలను స్వామికి సమర్పించుకున్నట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



సూచలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలో ముమ్మరంగా వరి నాట్లు సాగుతున్న తరుణంలో కాంప్లెక్స్ ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ అదనపు సంచాలకులు వి.విజయలక్ష్మి ఆదేశించారు. కూచిపూడి ఏడీఏ కార్యాలయంలో సోమవారం ఎరువుల డీలర్లు, సొసైటీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. వరి సాగుకు అవసరమైన ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుకాణదారులు అధిక ధరలకు ఎరువులు విక్రయాలు చేసినట్లయితే అధికారులకు ఫోన్ చేసి తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరి సాగు విస్తీర్ణం, ఎరువుల లభ్యత అంశాలపై సమాచారం సేకరించారు. కార్యక్రమంలో మొవ్వ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ) సూరపనేని శ్యామల, వ్యవసాయ శాఖ అధికారి సురేష్‌బాబు నాయక్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కాంతారావు హెచ్చరించారు. మండలంలోని శ్రీహరిపురం, ముదినేపల్లిలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ స్క్వాడ్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్క్వాడ్ డీఎస్పీ మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే సమయంలో రైతులకు దుకాణాదారులు అన్ని వివరాలతో కూడిన బిల్లులు విధిగా ఇవ్వాలన్నారు. రోజూ గొడౌన్లలోని నిల్వలను, స్టాక్ రిజిస్టర్లను సరిపోల్చుకోవాలని దుకాణాదారులకు సూచించారు. నిల్వల్లో తేడాలున్నట్లు గమనిస్తే ఆయా స్టాక్‌లను సీజ్ చేస్తామన్నారు. తనిఖీల్లో అనపర్తి, ఏలూరు, మండవల్లి ఏడీలు డీవీ కృష్ణ, ఈదా అనిల్‌కుమారి, జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



గుడివాడరూరల్: మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వారికి వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గుడివాడ ట్రాఫిక్ ఎస్‌ఐ పి.నాగరాజు అన్నారు. స్థానిక గౌతమ్ స్కూల్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉప్పాల హారికకు నాయకుల పరామర్శ



ఉప్పాల హారికను పరామర్శించిన ముదినేపల్లి నాయకులు

ముదినేపల్లి రూరల్: టీడీపీ శ్రేణుల దాడికి గురైన కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికను మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం పరామర్శించారు. పెడనలోని ఆమె నివాసానికి వెళ్లి సంఘీభావాన్ని ప్రకటించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో పలువురు నాయకులు హారికను పరామర్శించి పార్టీ తరఫున అండగా ఉంటామని మద్దతు పలికారు. అనంతరం ముదినేపల్లిలో ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ జిల్లా ప్రథమ పౌరురాలైన చైర్మన్‌కే రక్షణ లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అకారణంగా దాడి చేసిన టీడీపీ శ్రేణులను ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడంలోని ప్రభుత్వ ఆంతర్యాన్ని ప్రశ్నించారు. పరిస్థితులు ఇదేవిధంగా కొనసాగితే రాబోయే కాలంలో మహిళలు కూటమి ప్రభుత్వానికి తగిన రీతిలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. హారికను పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, శీలం రామకృష్ణ ఉన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఎస్‌ఎఫ్‌ఐ కార్యవర్గ సభ్యులు

గుడివాడ టౌన్: ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గాన్ని ఎన్నిక సోమవారం జరిగింది. స్థానిక ఆంజనేయపేటలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ఈ ఎంపికలో 12 మంది సభ్యులతో నూతన కార్యవర్గం ఏర్పడిందని జిల్లా కార్యదర్శి ఎస్. సమరం తెలిపారు. గుడివాడ మండల అధ్యక్షుడిగా ఎ.జగన్, పట్టణ కార్యదర్శి ఎ.నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా సాత్విక్ ప్రసాద్, అవినాష్, మండల కార్యదర్శులుగా సాయిపవన్, జె.గణేష్, రూదేవ్, కమిటీ సభ్యులుగా నవదీప్, సాద్విక్, జెన్నీఫా, రవీంద్ర, అర్జున్, తేజ ఎంపికైనట్లు సమరం తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాలపై నూతన కమిటీ పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సలీమ్, జిల్లా సహాయ కార్యదర్శి హారిక పాల్గొన్నారు.

తూముల పూడిక తీత పనుల్లో రైతులు



అవురుపూడిలో తూము పూడిక తీస్తున్న రైతులు

మొవ్వ: మండలంలోని అవురుపూడి సెంటర్ నుంచి కోసూరుకు వెళ్లే పంట కాలువ తూములు పూడిపోవడంతో రైతులే స్వయంగా పూడిక పనులను సోమవారం చేపట్టారు. ఈ సమస్యపై అధికారులకు గ్రామ సచివాలయం ద్వారా రైతు సంతకాలతో కూడిన అర్జీని ఈ ఏడాది మార్చి 28వ తేదీన సైతం ఇచ్చినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని అవురిపూడి రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామ సెంటర్లో ఉన్న చిరు వ్యాపారులు కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎంపిక గృహాల పరిశీలన



మండవల్లి: పెరికెగూడెంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ (ఎస్‌ఎస్‌జీ) టీం ఎంపిక చేసిన గృహాలు, బాత్ రూమ్‌లు, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను సర్పంచ్ పెరుమాళ్ల పద్మ, కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమక్షంలో సోమవారం పరిశీలించారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి ఆషాఢ సారె



భద్రిరాజుపాలెంలో ఆషాఢ సారెతో వస్తున్న భక్తులు



కొండలమ్మకు సారె సమర్పించిన భక్తులు

తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి భక్తులు ఆషాఢ సారెను ఘనంగా సమర్పించారు. స్థానిక శ్రీరాజరాజేశ్వరి రాజభద్రేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామానికి చెందిన చక్కా ఉదయభాస్కర రావు ఇంటి వద్ద నుంచి మహిళలు చీర, సారె, పూలు, పండ్లు, మేళతాళాలతో తరలివచ్చి రాజరాజేశ్వరి అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ అర్చకుడు ఉమామార్కండేయశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చాగంటి ప్రభాకర్‌రెడ్డి, ఆళ్ల మధుసూధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కొండలమ్మకు సారె..

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన మహిళా భక్తులు ఆషాఢ సారెను సోమవారం సమర్పించారు. అనంతరం ఆ భక్తుల పేరిట వేద పండితులు ప్రత్యేక పూజలను చేపట్టారు. అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న మహిళా భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మాధవ్‌కు అభినందనలు



ముదినేపల్లి రూరల్: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నియమితులైన పీవీఎన్ మాధవ్‌కు మండలానికి చెందిన పార్టీ నేతలు అభినందనలు తెలిపారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాధవ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ, కార్యవర్గ సభ్యుడు వొత్తుమిల్ల ప్రసాద్, మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, భుజంగ వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం ప్రారంభం



గుడ్లవల్లేరు: శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో బొప్పన శరత్ గోపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్ర వైద్యాలయం సౌజన్యంతో సోమవారం మెగా ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని కళాశాల సహ కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా బొప్పన శరత్ గోపాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, విజ్ఞాన్ జ్యోతి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ చీఫ్ పాట్రోన్ బొప్పన తారాచంద్, గౌరవ అతిథులుగా పాయినీర్ ఆటో వరల్డ్ డైరెక్టర్ చక్రి, మేడసాని రవీంద్ర విచ్చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొప్పన తారాచంద్ మాట్లాడుతూ ఉచితంగా నేత్ర వైద్య సేవలందించి, కళ్ల అద్దాల మార్పిడి, తదితర పరీక్షలు, ఆపరేషన్లకు అయ్యే రుసుంలో డిస్కౌంట్ ఉంటుందన్నారు. శిబిరాన్ని మరొక రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణకుమార్ తెలిపారు. అనంతరం కళాశాల యాజమాన్యం బొప్పన తారాచంద్, శంకర నేత్ర వైద్యాలయం సిబ్బందిని సత్కరించారు. డాక్టర్ ప్రియాంక అలుగుడి, డాక్టర్ నలిన్‌షా, బొప్పన శరత్ గోపాల్ ఫౌండేషన్ మేనేజర్ ఎం.రమేష్, శంకర నేత్ర వైద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దొరకని బాలుడి ఆచూకీ

- రంగంలోకి ఎన్డీఆర్‌ఎఫ్ బృందం
- కేఈబీ కాలువలో ముమ్మర గాలింపు



కేఈబీ కాలువలో గాలింపు నిర్వహిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది.. అదృశ్యమైన నిదీష్ (ఇన్‌సెట్లో)

తోట్లవల్లూరు: రొయ్యూరులో రెండు రోజుల క్రితం అదృశ్యమైన పడమట నిదీష్(10) ఆచూకీ ఇంతవరకు లభ్యం కాలేదు. పామర్రు మండలం నిమ్మకూరుకు చెందిన పడమట దుర్గా శ్రీనివాసరావు, సరోజిని దంపతుల కుమారుడు నిదీష్ రొయ్యూరులోని అమ్మమ్మ ఇంటికి వచ్చి గత శనివారం సాయంత్రం అదృశ్యమైన విషయం విదితమే. బాలుడు అదృశ్యమై 48 గంటలు గడిచినా ఇంతవరకూ ఆచూకీ లభ్యం కాకపోవటం సస్పెన్స్‌గా మారింది. నిదీష్ అదృశ్యంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. నిదీష్ ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని రంగంలోకి దించారు. సోమవారం రొయ్యూరు నుంచి నిమ్మగడ్డ లాకుల వరకు కేఈబీ కాలువలో ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది బాలుని ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి ఆచూకీ లభ్యం కాకపోవటంతో పలు అనుమానాలు చోటు చేసుకుంటున్నాయి. కేఈబీ కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడా లేక ఎవరైనా అపహరించారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బాలుడి ఆచూకీ కనుగొనేందుకు పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్‌ఐ అవినాష్ తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

రొయ్యూరులో నిదీష్ తల్లిదండ్రులు పడమట దుర్గా శ్రీనివాసరావు, సరోజిని దంపతులను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి సోమవారం పరామర్శించారు.

త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులుగా నియమితులైన వారు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడిగా అనగాని గంగాధరరావు, సభ్యులుగా సత్యనారాయణ, గంగరాజు ప్రమాణం చేశారు. వీరమల్లు నరసింహారావు, కోటయ్య, శంకరరావు, వరప్రసాద్, బాపూజీ పాల్గొన్నారు.

సచివాలయంలో రిలీవింగ్ సర్టిఫికెట్ల సందడి

మండవల్లి: మండవల్లి గ్రామ సచివాలయంలో సోమవారం రిలీవింగ్ సర్టిఫికెట్లతో సందడిగా మారింది. గతంలో నిర్మానుష్యంగా ఉండే సచివాలయంలో ఒక్కసారిగా సందడి ఏర్పడింది. ఈ సచివాలయంలో సోమవారం ఏ ఉద్యోగి జాయిన్ అయిన దాఖలాలు లేవు.

డ్రోన్ కెమెరాల సాయంతో ఆకతాయిలకు చెక్

మొవ్వ: డ్రోన్ కెమెరాల సాయంతో ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న ఆకతాయిలకు కూచిపూడి పోలీసులు చెక్ పెట్టారు. సోమవారం శక్తి బృందాల సహకారంతో డ్రోన్ కెమెరాల ద్వారా మొవ్వ కాలేజీ–బస్టాండ్ రోడ్డులో జల్లెడ పట్టి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను గుర్తించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించారు. మొవ్వలోని విద్యాలయాల వద్ద అల్లరి చేష్టలకు పాల్పడుతూ విద్యార్థులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తప్పవని కూచిపూడి ఎస్‌ఐ కేఎన్ విశ్వనాథ్ హెచ్చరించారు.